
# గేలం మింగిన చేప

- ఆకురాతి భాస్కర్‌చంద్ర



ఆంధ్రభూమి స్వర్ణోత్సవ కథల పోటీల్లో ప్రోత్సాహక బహుమతి రూ. 1,000/-గెల్చుకున్న రచన

"చూడ్డానికి యిదేదో పనికిమాలిన లోహపు ముక్క అనుకుంటాంగానీ యిది పురాతన నాణెం. ఎంతో విలువైనది. చరిత్రలో మానవులు పడిన కష్టాలు, కడగళ్లూ ఎన్నింటినో తనలో దాచుకుంది. మనకు వినే మనసుండాలేగాని మనుష్యులు చేసిన మోసాలు, పన్నిన కుట్రలు, వంచనలు యెన్నెన్నో చెబుతుంది. భవిష్యత్తుకీ భూత కాలానికి మధ్య వారధిలా, చరిత్రకు సాక్షీభూతంలా నిలుస్తుంది. ఇది ప్రస్తుతం యెందుకూ పనికి రాదు. అయినా పాత వస్తువుల్లో ఒక అనిర్వచనీయమైన సొగసు వుంటుంది. చిరిగిపోయిన గొడుగు, విరిగిపోయిన పడక్కుర్చీ, సొట్టలు పడిపోయిన టార్చిలైట్లు యిలా మన యిళ్లల్లో చాలానే వుంటాయి పనికిరానివి. అయినా మనం వాటిని గభాల్న పారేయటానికి మనసురాదు. ఎందుకంటే ఆ వస్తువుల్ని మనం చూసినప్పుడల్లా మన వయసు వెనక్కి వెళ్లిపోతుంది. ఒక జ్ఞాపకాల తెర మేలిముసుగులా మన మనసుల్ని కప్పివేసి సుదూర తీరాలకు చేరుస్తుంది."

భావావేశంతో ఊగిపోతున్నాడు శాంతారాం. అతనికి పాత నాణాలను సేకరించడం చాలా యిష్టం. ముఖ్యంగా భారతీయ రాజుల కాలంలో చలామణీలో వున్న నాణాలంటే ప్రాణప్రదంగా చూసుకుంటాడు. తన జీతంలోనూ జీవితంలోనూ ఎక్కువ భాగాన్ని వాటిని సేకరించడంలోనే గడిపాడు. భోజనం సంగతి కూడా మర్చిపోయి గంటలు గంటలు పురాతన నాణాల గురించి కబుర్లు చెబుతూ గడపగలడు. అతను కస్తూరిని ప్రేమించి పెళ్లి చేసుకున్నాడు. వాళ్లకు ఒక్కడే కొడుకు. ఈమధ్యనే యమ్బీబీయెస్ పూర్తిచేసి యమ్మెస్ చేసే ప్రయత్నాల్లో వున్నాడు. మధ్యాహ్న భోజనం ముగించుకుని కస్తూరితో కుటుంబ విషయాలు మాట్లాడుకునే సమయంలో ఎందుకొచ్చిందో గానీ పురాతన నాణాల సంగతి వచ్చింది. శాంతారాం ఆ విధంగా ఉపన్యాసంలోకి దిగాడు.

"ఆవు కాంపోజిషన్‌లాగా వీడు యే విషయాన్నయినా అక్కడికే తెస్తాడా యేంటమ్మా?" అంటూ ప్రవేశించాడు మిత్రుడు సుందరం. కాలేజీ చదువుకునే రోజులనుంచీ కస్తూరి సుందరం శాంతారాం మంచి స్నేహితులు. కస్తూరి శాంతారాంల ప్రేమ వ్యవహారంలో సుందరం చేయి కూడా వుందని అంటుంటారు. రక్తం పంచుకు పుట్టలేదన్న మాటేగానీ సుందరం కస్తూరికి సొంత అన్న కంటే యెక్కువ.

"అన్నయ్యా...ఎండలో వచ్చావు మజ్జిగ తీసుకుంటావా" అనడిగింది కస్తూరి.

"వద్దమ్మా...కాస్త మంచి నీళ్లివ్వు చాలు" అంటూ కుర్చీలో కూలబడ్డాడు సుందరం. "మొన్న నేను చెప్పిన కాలేజీ వాళ్లు ఫోన్ చేసార్రా. సీటు ఖాయం అయిపోయినట్టేననుకో.. కానీ... డొనేషన్ 20 కంటే తగ్గనంటున్నారు" అన్నాడు సుందరం.

శాంతారాంకి చిర్రెత్తింది. "డొనేషనా.. యెందుకురా.. వాడికి మెరిట్ మీదే వస్తుంది."

"నీకు బ్రతకటం యెప్పుడొస్తుందో తెలిసి చావటం లేదు. దేశం మొత్తంమీద చూసినా యమ్మెస్‌లో వంద సీట్లుంటాయో లేదో మరి కాంపిటీషన్ చూస్తే వేలల్లో వుంటుంది. మెరిట్‌ని నమ్ముకుంటే పని జరగదు. మనదారి మనం వెతుక్కోవలసిందే." సుందరం చెప్పాడు.

శాంతారాంకి అసహనంగా వుంది. కొడుకు బాగా చదువుతాడు. మంచి మార్కులు తెచ్చుకున్నాడు. అయినా 20 లక్షలు డొనేషన్ కట్టాలట..! అన్ని లక్షలు పెట్టి యిప్పుడు యమ్మెస్ చేయటం అవసరమా..? అదే ప్రశ్న సుందరాన్ని అడిగాడు.

సుందరం నవ్వి, "యమ్బీబియెస్ డాక్టరంటే యిప్పుడెవడు లెక్క చేస్తున్నాడు చెప్పు. అవసరం వున్నా లేకపోయినా చాంతాడంత మందులు రాయాలి. బీపీ ఒక్కటే చూసి పంపిస్తే పిచ్చి డాక్టరనుకుంటున్నారు. కనీసం నాలుగైదు టెస్టులు స్కానింగులు రాస్తే గానీ తృప్తిగా వుంటంలేదు. మనింటికి ఆచారిగారని వచ్చేవారు గుర్తుందా. మన వూళ్లో యెవడికి యేం జబ్బుచేసినా ఆయన హస్తవాసి చలవతో తగ్గాల్సిందే కదా. మరిప్పుడు అలాంటి డాక్టర్లూ లేరు. పేషంట్లూ లేరు. అందుకని దేన్లో వో దాన్లో స్పెషలైజేషన్ చేసేస్తే.."

'స్పెషలిస్టుగా బోర్డు తగిలించుకుని వేలకి వేలు ఫీజులు గుంజుకోవచ్చు" వెక్కిరింతగా అన్నాడు శాంతారాం.

సుందరం చిరాగ్గా చూసి "ఫీజులు గుంజటం యెందుకు ఫ్రీగా రోగుల్ని చూడమను.. ఎవరొద్దన్నారు.. మనం డాక్టరయ్యాక ఫీజు తీసుకుంటామా లేదా అన్నది మనిష్టం.. కానీ డాక్టరు కావాలంటే మాత్రం డొనేషన్ కట్టాల్సిందే. ఇదిగో నీ అడ్డమైన ఆలోచన్లతో వాడి భవిష్యత్తుని పాడుచేయకు. అంతగా డబ్బులేకపోతే యీ యిల్లు తాకట్టు పెట్టి తీసుకో.. వాడు డాక్టరయ్యాక రెండు సంవత్సరాల్లో యిక్కడ పెద్ద ప్యాలెస్సే కడతాడు.. బాగా ఆలోచించు.. నో అని మాత్రం చెప్పకు" తను చెప్పాల్సింది గబగబా చెప్పేసి వెళ్లిపోయాడు సుందరం.

మంచినీళ్లు తెచ్చిన కస్తూరి అలాగే నిల్చుండిపోయింది. శాంతారాం మౌనంగా వుండిపోయాడు. సుందరం చెప్పిన దాన్లోకూడా అసత్యంలేధు. కానీ తన ఆలోచనలు వేరు. తను కాలేజీలో చదివే రోజుల్లో సమసమాజం రావాలని కలలు కనేవాడు. తనకు ముసలితనం వచ్చేసింది గానీ తను కలలుకన్న సమాజం కనుచూపుమేరలో కూడా లేదు. అసలు అలాంటి సమాజం వుందో లేదోనన్న అనుమానం తనకు కలుగుతోంది. 'సర్వేజనాస్సుఖినోభవన్తు".. అందరూ సుఖపడడం సాధ్యమేనా అసలు? అనుభవం అసాధ్యమని చెబుతోంది. తను కొంతవరకు నయం. సమాజం మధ్యలో వుండి పౌర జీవనం చేస్తున్నాడు.

కానీ అడవులు పట్టిపోయిన వాళ్ల మాటేవిటి..? వాళ్లు యెవరికోసం పోరాడుతున్నారు..? వాళ్లు కోరుకున్న సమాజం ఆనవాళ్లయినా వాళ్లు కనిపెట్టగలిగారా..? తను యెంతో కష్టపడి ఊరికి దూరంగా యీ స్థలం కనుక్కున్నాడు. ఎప్పటికైనా బీదాబిక్కీ హాయిగా బ్రతికే ఒక శరణాలయం కట్టాలనుకున్నాడు. కానీ యిప్పుడు యీ యింటిని అమ్మటమో

తాకట్టు పెట్టటమో చేస్తేనే గానీ తన కొడుకు బ్రతుకు
ఒక దారికి వచ్చేట్టు లేదు.. యేం చేయాలి..?

ఆరోజు రాత్రి శాంతారాంకు నిద్రలేదు.

❋ ❋ ❋

శాంతారాం ఉలిక్కిపడి లేచాడు. ఎవరివో గొంతు
కలు పెద్దగా వినబడుతున్నాయి. మధ్యలో కస్తూరి
యేడుస్తూ యేదో చెబుతోంది. మంచంమీంచి లేచి
వేగంగా బయటికి నడిచాడు. ఇంటిముందు పది
మంది వస్తాదుల్లాంటి మనుష్యులు తమ యింటి
స్థలాన్ని కొలతలు కొలుస్తున్నారు. కస్తూరి వారిస్తున్నా
వాళ్లు వినటం లేదు, హడావుడిగా వెళ్లాడు శాంతారాం.
"ఏవండోయ్.. మిమ్మల్నే.. యేం చేస్తున్నారక్కడ. మా
యింటికొచ్చి యిలా కొలతలు కొలవటం యేవిటండీ..
"ఎవరూ సమాధానం చెప్పకుండా వాళ్ల పని వాళ్లు
చేసుకుంటున్నారు. శాంతారాంకి కోపం వచ్చింది.
ఒకడి చొక్కా పుచ్చుకుని "అడుగుతున్నది నిన్నే
నయ్యా.. ఎవరు మీరు? యిక్కడ కొలతలు యెందుకు
కొలుస్తున్నారు?" అనడిగాడు. అతను వెంటనే కత్తితీసి
శాంతారాం మెడకు పెట్టాడు. కస్తూరి భయపడిపో
యింది. ఇంతలో ఫ్యాంటూ షర్టూ వేసుకున్న రాక్ష
సుడు హంస వాహనంలోంచి దిగినట్టు తెల్లటి కారు
లోంచి దిగాడు రాంకోటి. వచ్చీరావటంతోటే కత్తి
తీసిన వాణ్ణి చాచి కొట్టాడు "యెదవా.. చెల్లెమ్మ జడుసు
కుంది గదరా.. అయినా మనం గీడకెందుకొచ్చినం?"
అని కస్తూరి వైపు తిరిగి "మరేం లేదు చెల్లెమ్మా.. మీ
జాగా నాలుగు రోడ్ల జంక్షన్ యిశాలంగా వుండాది..
నీకు తెలుసుకదా.. గీడకి అర కిలోమీటరు దూరంలో
కంప్యూటర్ సిటీ కట్టబడతది. మంది మస్తుగా వస్తరు.
మరి వాళ్లందరూ తిండి తినాల్నా.. మస్తుగ తాగాల్నా..
దానికోసమని జెప్పి.. గీ జగాలో మస్తుగా.. బడా
షాపింగ్ మాల్ కట్టినం అనుకో... గీడ డెవలప్‌మెంటు
జరుగుద్దని మా పోరగాళ్లందరూ అంటున్నరు.. సరె
తియ్ గట్లనే జేద్దామని జెప్పిన.."

శాంతారాంకి విషయం అర్థమైంది. "మీ ఆలోచన
బాగానే వుందిగానీండి.. నేను యీ స్థలం అమ్మనండీ"

ఆ మాటకు ఫెళ్ళున నవ్వాడు రాంకోటి. "నువ్వో
పాగల్ గానిలెక్కున్నవే.. నేనీడ యమ్మెల్యే కావాలను
కున్న.. పార్టీవోళ్లు సీటిచ్చిన్రా.. లే.. నేనే గుంజుకున్నా..
గీ ప్రజలకు ఓటెయ్యమని జెప్పిన.. యేసిన్రా? గీ తుక్కు
యాపారం జేసేటోడు యమ్మెల్యే అవుడేంది అన్నరు..
గిట్ల కాదని జల్సా చేసుకోనీకి పైసలిచ్చిన.. తాగనీకి
సార ప్యాకెట్లు పంచిన.. తినేదానికి బిర్యాని పొట్లాలి
చ్చిన.. గిన్ని యిస్తెనెగానీ కొడుకులు ఓట్లు యెయ్యలె..
కొడుకులు.. మరి నేను ఖర్చుపెట్టిన పైసలు యేడకెళ్లా
స్తయ్..?"

శాంతారాంకి పంతం పెరిగింది. "మీరెంత డబ్బి
చ్చినా యీ స్థలాన్ని మీకు అప్పగించే ప్రసక్తే లేదండీ..
నేను అమ్మను.. ఒకవేళ మీరు బలవంతంగా నానుంచి
లాక్కున్నా నేనూరుకోను.. అసలీ స్థలం..." రాంకోటి
గొంతు మారింది. "అరె చుప్... బహుత్ హోగయా..
యిగో నాతోని లొల్లీ పెట్టొద్దు. యీ జగా నాకు కావాలె
గంతె. మీకు యాభై లక్షలిస్త.. పిల్లజల్లతోని వుండనీకి
మంచి ప్లాటుకూడా యిస్తతియ్.. సక్కగుండండి.. ఒక్క
టికాదు రెండు కాదు.. యాభై.. యాభై లక్షలు... పోర
గాన్ని మంచిగ చదివిపిచ్చండి.. మీరు ఆరామ్‌గా
వుండండ్రి. గరీబోళ్లకి సాయంజేస్తే యేమొస్తదయ్యా..
రేపు నువ్వు చచ్చినంక కూడా ఫొటోకి దండేయనీకి
కూడా ముస్తెత్తుతారు. చెల్లెమ్మా.. నువ్వయినా జరంత
చెప్పు..బాగా సోంచాయించండి.. (వెళ్లబోతూ) యిష్ణు
మూర్తి పొట్టి పోరగానిలెక్క వొచ్చి మూడడుగుల నేల
డిగిండు. ఒక్క అడుగుతోని బూవిని తొక్కిండు. మరో
అడుగుతోని ఆకాశం మూసిండు. మూడో అడుగేసి
బలిచక్రవర్తిని పాతాళంలకి తొక్కిండు. నాయకులంత
బూవులు కబ్జజేస్తున్నారని ప్రజలు లొల్లి పెడతరుగానీ
ముందుగ కబ్జచేసినోడు ఆ యిష్ణుమూర్తే.. గంటె
యేమన్నట్టు.. యీ కబ్జ దందా గిప్పటిది కాదన్నట్టు..
దేవుళ్లకెళ్లి నడుస్తున్నది... నేను చెప్పినది కాదన్నవ



యిగో నాతోని లొల్లీ పెట్టొద్దు. యీ
జగా నాకు కావాలె గంతె. మీకు యాభై
లక్షలిస్త.. పిల్లజల్లతోని వుండనీకి మంచి
ప్లాటుకూడా యిస్తతియ్.. సక్కగుం
డండి.. ఒక్కటికాదు రెండు కాదు..
యాభై.. యాభై లక్షలు... పోరగాన్ని
మంచిగ చదివిపిచ్చండి..
మీరు ఆరామ్‌గా వుండుండ్రి.

నుకో.. పాతాళంకెళ్లి తొక్కుత బిడ్డా.. "శాంతారాం
హతాశుడైపోయాడు. మెదడు మొద్దుబారిపోయింది.
ప్రజల్ని కాపాడవలసిన నాయకులే ప్రజల్ని భయపెట్టి
వాళ్ల ఆస్తుల్ని కబ్జా చేస్తుంటే ఎవరికి చెప్పుకోవాలి..?
గజేంద్రమోక్షంలో పద్యం గుర్తుకొచ్చింది. లావొక్కిం
తయు లేదు.. అవును.. యీ దేశంలో 'లా' ఒక్కింత
యినా లేదు..

❋ ❋ ❋

శాంతారాం పగలబడి నవ్వుతున్నాడు. అతని ప్రవ
ర్తన అక్కడున్న యెవరికీ అర్థంకావటంలేదు. కొంప
దీసి పిచ్చిగానీ పట్టలేదుగదా అనుకున్నాడు సుందరం.
"యేం జరిగిందమ్మా అసలు?" కస్తూరిని అడిగాడు.
కస్తూరికి మాత్రం యేం తెలుసు. రాంకోటి వార్నింగ్
యిచ్చి వెళ్లాక ఆ యింట్లో ఒకరితో ఒకరు మాట్లాడుకో
వాలన్నా భయపడిపోయారు. గాలి కదిలితే రాంకోటి
నవ్వులా వినిపించింది వాళ్లకి.

చివరకు శాంతారామే నోరు విప్పాడు. "ఎందుకర్రా
అంత కంగారు పడిపోతున్నారు. నిన్న మొన్నటివరకూ
యేదో ఉద్యోగం చేసుకుంటూ ప్రతినెలా సరుకులు
తెచ్చుకోవటం, భార్యాబిడ్డల్ని పోషించుకుంటూ దేశం
సుభిక్షంగా వుందని నమ్మేస్తూ బ్రతికిన నాకు మన
దేశంలో న్యాయం నాలుగుకాకుండా నలభై పాదాలతో
నడుస్తుందని నిన్ననే తెలిసింది." సుందరానికి చిర్రెత్తు
కొచ్చింది. "యేం జరిగిందో చెప్పకుండా యీ కవిత్వం
చెపుతాంవేంట్రా?"

"మీరు చెవులొగ్గితే అదే చెప్పబోతున్నా.. వినండి.
ఇక్కణ్నుంచి తిన్నగా నేను పోలీస్‌స్టేషనుకు వెళ్లాను.
అక్కడ ఒకే ఒక్క కానిస్టేబులున్నాడు. హెల్మెట్ పెట్టు
కోని వాళ్లకి చలానాలు రాయటానికి కొందరు, అదేదో
తెలుగు సినిమా రిలీజయితే బందోబస్తుకు మరికొం
దరు వెళ్లారంట. సరే.. ఆ వున్నవాడికే నా మొర వినిపిం
చాను అయ్యా.. మా యింటి స్థలంలో యమ్మెల్యేగారు
షాపింగ్ మాల్ కడతామన్నారు. అందుకు బలవం
తంగా నా యింటి స్థలాన్ని అమ్మమంటున్నారు.. నేనైతే
మాత్రం యెట్టి పరిస్థితుల్లోనూ ఆ స్థలాన్ని అమ్మే ప్రస
క్తేలేదు కాబట్టి కేసు రాసుకోమని చెప్పాను. అతను
చాలా సంతోషించి నన్నో వెర్రివెంగళప్పలాగా
చూసాడు. అంత మంచి అవకాశంవస్తే ఎగిరి గంతే
యాలి గానీ యిలా యెగురుకుంటూ కంప్లయింట్
యివ్వటానికొస్తారా అని కేకలేసాడు. మధ్యలో కస్తూరి
కలగజేసుకుని "అలాగన్నాడా? అయినా ఆ స్థలంలో
మనకో యిల్లుందని అందులో సంసారాలున్నాయని
చెప్పారా?" అంది. శాంతారాం చిరునవ్వు నవ్వాడు.
"చెప్పాను. కస్తూరీ ఆ మాటే చెప్పాను. అందుకు
వాడు కాపురం చేసేది మీ ఆవిడతోనేనా.. లేక.. అంటూ
తెలివిగా వెకిలిగా అడిగాడు. నాకు కోపం వచ్చి నా
పర్సులోవున్న మన పెళ్లి ఫొటో చూపించాను అయినా
నమ్మలేదు. డిజిటల్ టెక్నాలజీతో యిలాంటి ఫొటోలు
యెన్నయినా తీయొచ్చని కొట్టిపారేశాడు. చూసావా..
టెక్నాలజీ పెరిగేకొద్దీ మనుష్యులమీద నమ్మకం ఎలా
దిగజారిపోతోందో.."

"యేడిశాడు వెధవ.. బుద్ధిలేని గాడిద.. వాడింట్లో
పీనుగెల్ల.. వాడికంటే పెద్దాఫీసరుకి కంప్లయింట్ చేయ
కపోయారా" అంది కస్తూరి పౌరుషంగా. "నేనూ
నీలాగే ఆలోచించి యమ్మెల్యే కంటే యం.పీ. కాస్త
లెవల్లో ఎక్కువ కాబట్టి ఆయన దగ్గరకు వెళ్లా.. ఆయన
ఎంతో సాదరంగా ఆహ్వానించి పనేమిటని అడిగారు..
చెప్పాను. ఆయన యమ్మెల్యే గారు చేస్తున్న అరాచక
పనులమీద అరగంట ఉపన్యాసం యిచ్చి యమ్మెల్యే
ఆగడాలు ఆపాలంటే యీ విషయాన్ని పార్లమెంటు
దృష్టికి తేవాల్సిందేనన్నారు.. కాని..వాళ్లకి కాస్త ఖర్చులు
న్నాయట. పార్లమెంటులో మన విషయం చర్చించేం
దుకు పది లక్షలన్నా యిమ్మన్నాడు. అందుకని నేనో
నిర్ణయానికొచ్చాను" ఆగాడు శాంతారాం.

కస్తూరి కళ్లలో నీటి పొర..! "యీ యిల్లు అమ్మే
స్తారు.. అంతేగా.." అంది.

శాంతారాం మొహంలో అలసట కనిపిస్తోంది. వేల
వేల కిలోమీటర్లు నీళ్లలో యీదిన వాడిలాగా అతని
మొహం ఉబ్బిపోయి వుంది. కళ్లు యెర్రబారాయి.
రాబోతున్న కన్నీళ్లని ఆపుకుంటూ అన్నాడు. "కస్తూరీ..
నేను యీ స్థలం కొన్నపుడు యిక్కడసలు జన సంచా
రమే వుండేది కాదు. విశాలమైన స్థలంలో పూల
మొక్కలు, కూరగాయలు పండించుకుంటూ రాత్రి
పూట దొంగల భయానికి జట్లు జట్లుగా కాపలాలు
కాస్తూ తిరిగేవాళ్లం. అప్పుడంటే అందరం మధ్యతర
గతి వాళ్లం కనుక మా మధ్య స్నేహం కూడా ఎక్కువ
గానే వుండేది. ఒకళ్ల అవసరానికి ఒకళ్లం తోడుండే
వాళ్లం. ఈ యింట్లోనే మురళి కళ్లు తెరిచాడు. కళ్ల
ముందే పాతికేళ్లు గడిచిపోయాయి. మురళిని చూస్తే
ఎంత తృప్తిగా వుంటుందో యీ యింట్లో వున్నా అంతే
తృప్తిగా వుంటుంది. అటువంటిది యిప్పుడు యీ
యిల్లు వదిలిపెట్టటం అంటే.. పైగా యీ గోడలు కూలి
పోయి మట్టిలో కలిసిపోతాయంటే.." చిన్న పిల్లాడిలా
యేడ్చాడు శాంతారాం. అతన్ని ఓదార్చే శక్తి అక్కడున్న
వాళ్లెవరికీ లేదు. .. నిద్రాదేవికి తప్ప. అతనలా వేదన
తోనే నిద్రపోయాడు. ఆ నిద్రలో అతనికి చీనిచీనాంబ
రాలతో ఒక దివ్య పురుషుడు కనిపించాడు.. అతన్ని
యెక్కడో చూసాడు. (మిగతా 27వ పేజీలో)

(18వ పేజీ తరువాయి)

యెక్కడ? గుర్తుకొచ్చింది. మౌర్యవంశ స్థాపకుడు.. చంద్రగుప్తుడు.. ఇతని కాలంలో తయారుకాబడిన పంచలోహ నాణెం తన దగ్గరుంది. ఆ నాణెంమీద వున్న పెద్దమనిషి యిప్పుడెందుకొచ్చాడబ్బా.. అని శాంతారాం అయోమయంలో వుండగానే ఆ ఆకారం శాంతారాంతో యేవేవో మాట్లాడసాగింది. రాత్రి మెల్లగా గడుస్తోంది...!

❋ ❋ ❋

పది రోజులుగా శాంతారాం చాలా హుషారుగా వుంటున్నాడు. ఎవరికీ యేమీ చెప్పడు. అతని వాలకం చూసి కస్తూరి భయపడిపోతోంది. అంతకుముందు రోజు ఉదయాన్నే అయితే కారు కొంటానని ఊళ్లో వున్న ఆటోమొబైల్ కంపెనీలన్నిటికీ ఫోన్లుచేసి వివరాలు సేకరించాడు. ఈ విషయం తెలియగానే కస్తూరి తమ్ముడు వూరినుంచి ఫోన్‌చేసి "బావనేదైనా పిచ్చాసుపత్రిలో చేరుద్దామే" అనడిగాడు. ఎంతైనా భర్తను పిచ్చాసుపత్రిలో చేర్చటానికి యే భారతనారి అంగీకరిస్తుంది...? కస్తూరి కూడా అడ్డంగా తలూపింది. "ఆయన మామూలుగా బాగానే వుంటున్నార్రా.. కాకపోతే, నాలుగు రోజులనుంచీ ఆయన ప్రవర్తన చూస్తుంటే తల తిరిగిపోతుందిరా. పొద్దున్నుంచీ సాయంత్రంవరకూ తిరిగి తిరిగి ఊళ్లో వున్న ఖాళీ స్థలాల రేట్లు, వాటి మ్యాపులు, లేఔట్లు పట్టుకొస్తున్నారు. ఎక్కడెక్కడ స్థలాలు యెంతెంత రేట్లున్నాయో ఆపకుండా చెబుతానే వుంటున్నారు. ఊరి చివర స్థలం కొని యింతకంటే పెద్ద యిల్లు కడతారంట. ఊళ్లోకి రావటానికి సిటీ బస్సులైతే ఆలస్యం అయిపోతుందని చిన్నకార్లు కూడా బేరమాడటం మొదలుపెట్టారు. ఏమిటండీ అంటే వెర్రి నవ్వు నవ్వుతారు కానీ అసలు విషయం చెప్పరు. మిగతా విషయాలన్నిట్లోనూ బాగానే వున్నారు.. యేదైనా అవసరం అనుకుంటే ఫోన్ చేస్తాను.. నువ్వు రావాల్రా.." అని తమ్ముడ్ని అడ్వాన్స్‌గా రెడీ చేసుకుంది. అప్పుడే శాంతారాం స్నానం చేసి హుషారుగా పద్యం పాడుకుంటూ వచ్చాడు.. "భక్త యోగ పదన్యాసి వారణాసి.." పద్యం పూర్తవుతుండగానే సుందరం హడావుడిగా వచ్చాడు.

"యేరా.. శాంతారాముడూ... నే విన్నది నిజమేనా?... ఊరు చివర మూడెకరాల పొలం కొన్నావట యీ వయసులో వ్యవసాయం చేస్తావా కొంపదీసి" అనడిగాడు సుందరం.

"నీ బొంద.. అది నేను కట్టాలనుకున్న ఓల్డ్‌యేజ్ హోం కోసం..." అన్నాడు శాంతారాం. "ఒరేయ్ యీ రోజుల్లో ప్రాణంవున్న మనుష్యులమీదే ప్రేమలు లేకుండాపోతున్నాయి. ప్రాణం లేని యిటుక రాళ్లమీద ప్రేమలేవిటే నా పిచ్చిగాని.. అందుకే యీ యిల్లు రాంకోటికి అమ్మేసి ఆ డబ్బుతో ఊరికి దూరంగా పోతున్నా" సరిగ్గా ఆ సమయానికే రాంకోటి వచ్చాడు. "చెల్లెమ్మా.. మీ ఆయన సమజ్‌దారీ.. యేలెక్క మనుషుల్తోటి యెట్లుండాల్నో మంచిగ దెల్సినోడు. చెల్లెమ్మా.. జల్దీ యేం లేదు. జరంత మెల్లగా సర్దుకో. గాజు సామాన్లు గిట్లవుంటే మంచిగ మూటలు కట్టండ్రి.. డామేజీ గిట్ల అవుకుండ. ఔ గానీ శాంతారామూ నీ తీరు చూస్తుంటే నాకు పరేశానవుతున్నదయ.. జగా యిడవనీకి పెద్ద లొల్లి జేస్తవనుకున్నగని గిట్ల సెటిలయితదనుకోలేదు బయ్.. ఔగానీ బయట మంది మస్తుగ వున్నరు.. ఎవ్వరు...?"

"మీడియా వాళ్లు సార్" అన్నాడు శాంతారాం. ఉలిక్కిపడ్డాడు రాంకోటి" ఆల్లతోని యేం పని?"

"మీలాంటి వాళ్లు నాలాంటి వాడి దగ్గర స్థలం తీసుకుంటే మీరు నాకు డబ్బిచ్చినా ప్రజలేమనుకుంటారంటే కబ్జా చేసారనుకుంటారు. మీకు అలాంటి అపవాదు రాకుండా మీరు నాకు డబ్బు యిచ్చేప్పుడు మీడియావాళ్లు కవర్ చేసారంటే అది సాక్ష్యంగా వుంటుంది. ప్రతిపక్షంవాళ్లు గోల చేయకుండా వుంటారు."

శాంతారాం ఆలోచన బాగా వున్నట్టనిపించింది రాంకోటికి. దేశంలో వున్న అన్ని భాషలవాళ్లు కవరేజ్ చేస్తూండగా యింటి దస్తావేజులు రాంకోటికి అందజేసాడు శాంతారాం. అందుకు ప్రతిఫలంగా యాభై లక్షల సూట్‌కేసుని రాంకోటి అందజేసాడు. అందరూ చప్పట్లుకొట్టారు. రాంకోటి అనుచరులంతా చాటుగా మందుకొట్టారు. వేదమంత్రాల మధ్య భూమి పూజ ప్రారంభమైంది. కొబ్బరికాయ కొట్టారు. హారతులు వెలిగించారు. పలుగు నేలలో దించారు. ఒకటి.. రెండు.. మూడు.. నాలుగు.. అయిదు.. ఆరో దెబ్బకి ఠంగ్‌మని శబ్దం. యేవిటా అని అందరూ ఆశ్చర్యపోయారు.. లంకె బిందెలు..! జనంలో ఉత్సాహం. "తియ్యండి తియ్యండి.. జాగ్రత్త.. జాగ్రత్త..బంగారం వుందేమో" "యేమైనా రాంకోటిగారు అదృష్టవంతులు" "పాతికేళ్లున్నాడు.. శాంతారాం.. కానీ లాభమేంటి.. లక్ష్మీదేవి రాంకోటిగారినే వరించింది" ఎవరికి తోచింది వాళ్లనుకుంటున్నారు. మీడియావాళ్లకి బోల్డంత పని బడింది. కెమెరాలు క్లిక్‌మంటున్నాయి. మూతికి మైక్ అంటించుకుని వంకర్లు పోతున్నారు యాంకర్లు... "షాపింగ్ మాల్‌కోసం భూమి పూజచేస్తున్న సమయంలో యేవో లంకెబిందెలు బయటపడ్డాయని కోలాహలంగా వుంది. కొంతమంది యింతకు మునుపే యీ భూమిని అమ్మేసిన శాంతారాం దురదృష్టానికి బాధపడుతుంటే రాంకోటిగారు అదృష్టవంతుడని కొందరంటున్నారు. ఆయన నిజంగానే అదృష్టవంతుడు. రాంకోటిగారు చెత్త వ్యాపారంచేసి అంచెలంచెలుగా యెదిగి యీనాడు యీ స్థాయికి చేరుకున్నారంటే ఆయన నిజంగానే యెంతో అదృష్టవంతుడని అందరూ నమ్ముతున్నారు. అదృష్టం వరించిన ఆ లంకె బిందెల వ్యవహారం చూద్దాం రండి" కెమెరాలన్నీ మట్టికుండలవైపు ఫోకస్ అయ్యాయి.

**"ఒరేయ్ యీ రోజుల్లో ప్రాణం వున్న మనుష్యులమీదే ప్రేమలు లేకుండాపోతున్నాయి. ప్రాణం లేని యిటుక రాళ్లమీద ప్రేమలేవిటే నా పిచ్చిగాని.. అందుకే యీ యిల్లు రాంకోటికి అమ్మేసి ఆ డబ్బుతో ఊరికి దూరంగా పోతున్నా"**

కుండలపైనున్న మట్టిని మెల్లగా తొలగించారు. లోపల రాగి నాణాలు..! అక్కడక్కడా వెండివి కూడా వున్నాయి. మీడియాలో వున్న వాళ్లెవరో అన్నారు. "యివి మామూలు రాగి నాణాలు కాదండీ. అతిపురాతనమైన వెండి నాణాలు. యిదిగో యీ గుర్రపు తల చూసారా.. దీనిపైనున్న లిపి చూసారా.. యిది మామూలు తెలుగు హిందీ యింగ్లీషు భాషలు కాదండీ.. చూసారా.. యివి దాదాపు రెండు వేల సంవత్సరాల క్రితంనాటి నాణాలండీ. బహుశా.. యే శాతవాహనులవో.. మౌర్య సామ్రాజ్యానివో అయ్యుంటాయి. అంటే యిక్కడ రెండువేల సంవత్సరాల నాటి నాగరికతకు ఆధారాలు దొరుకుతున్నాయన్నమాట.. ఆహా.. మీరు అదృష్టవంతులు" ఇప్పుడు మైకులన్నీ రాంకోటి నోటిముందుకొచ్చినయ్. "సార్.. యిలాంటి నిధి నిక్షేపాలు బయటపడిన తరువాత ప్రయివేటు వ్యక్తులు త్రవ్వకాలు సాగించకూడదు కదా.. యిలాంటి నిక్షేపాలు దొరికి స్థలాలను జాతీయ సంపదగా ప్రకటించి ప్రభుత్వానికి అప్పగించాలి. మీరు ఆ విషయాన్ని పాటిస్తారా." రాంకోటి అయోమయంగా చూసాడు. కొద్దిక్షణాల క్రితం యాభై లక్షలు పోసి కొన్న స్థలాన్ని జాతీయ సంపదగా ప్రకటించి ప్రభుత్వానికి యిచ్చేయాలా.. అప్పనంగా.. ఒకవేళ యివ్వకపోతే యేమవుద్ది.. ఎవడేం పీకుతాడు.. రహస్యంగా యి మాటనే తన సెక్రట్రీ చెవిలో చెప్పాడు రాంకోటి. సెక్రట్రీ చిరునవ్వు నవ్వుతూ.. "సరే అలాగే వుంచుకోండి. జాతి విద్రోహ కార్యక్రమాలు చేసినట్టు జైల్లో తోస్తారు. హైకమాండ్‌కి కోపం వస్తే మీ పదవుల్ని ఊడబెరుకుతారు."

రాంకోటి ప్రజలందరికీ వందనం చేసాడు. 'గీడ షాపింగ్ మాల్ కట్టెడిది ఆపేసినం. యియాల శాన మంచి దినం. రెండువేల సంవత్సరాలనాడు యీడ యేం జరిగినదో తెల్వనీకి మనకి మాల్ దొరికినాది. ఈ జగా పెబుత్వానికి వొప్పజెప్పి ప్రజలకి అంకితమిచ్చేయ్ మని చెబుతాం. ఎవ్వడైనగానీ చట్టం ముందు సమానమన్నట్టు జైహింద్.." యేడవలేక నవ్వాడు. నవ్వుతూ యేడ్చాడు. యేడుస్తూ నవ్వాడు. చివరకు శాంతారాం చెవిలో గుసగుసలాడాడు.

"యీ ప్రాజెక్టుమీద 50కోట్లు లాభం సంపాయించాలె అనుకున్న.. మట్టిలో కలిపావ్.. గుప్పెడు రాగి పైసలు.. పాత కుండ.. నా యాభై కోట్ల లాభం బూడిదలో పోసినయ్.. సంగతి తేలుస్త బిడ్డా.. తేలుస్త.." అన్నాడేగానీ మళ్లీ ధైర్యం చాల్లేదు. శాంతారాంను పక్కకు తీసుకెళ్లి "శాంతారాం జరిగిందేదో జరిగిపోయింది. రక్తపాతం కోర్టులు పోలీసులు లేకుండా కోలుకోలేని దెబ్బ యెలా కొట్టాలో కొట్టి చూపించావ్. బుర్రలో గుజ్జుండాలెగానీ బందూకులు కూడా మట్టి కుండలో కలుస్తాయని ఆనాడు గాంధీ చెప్పిండంట యిప్పుడైతే నిన్నే చూసిన.. యిగో శాంతారాం.. యీ సిటీల యింక చాలాచోట్ల గిట్లనే షాపింగ్ మాల్‌లు కట్టిపిస్తున్న.. నీ యింట్ల పైసల్ దాచిన రాజుగాన్కి చెప్పు ఆ మట్టికుండలు, రాగిపైసలు యింకెక్కడ కనపడొద్దు బయ్ నీ కాల్మొక్త.." శాంతారాంకి నవ్వొచ్చింది. మెల్లగా నవ్వాడు. పగలబడి నవ్వాడు. నవ్వుతూనే వున్నాడు.. మనసులో చంద్రగుప్తునికి ధన్యవాదాలు చెప్పుకుంటూ.. ★

**రచయిత చిరునామా:**

ఎ.భాస్కరచంద్ర,
డిప్యూటీ మేనేజర్ ఆంధ్రా బ్యాంక్,
కంటోన్మెంట్ బ్రాంచ్,
21, ఉల్‌సర్‌రోడ్, బెంగళూర్- 560 042.